E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

12-04-2025 శనివారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com



ఆర్టీఈ అమలుపై అఫిడవిట్ దాఖలు చేయండి..

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

3లో



## రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపింది: కేటీఆర్

**రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 3డీ మంత్ర (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) అమలు చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.**

**ఈ కబురు,హైదరాబాద్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 3డీ మంత్ర (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) అమలు చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని.. సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని తెలిపారు.

రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని, రూ.10వేల కోట్ల కుంభకోణానికి ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. సీఎంకు భాజపాకు చెందిన ఓ ఎంపీ వెనుక నుంచి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారన్నారు. ఓ బ్రోకరేజ్ కంపెనీతో సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఎఫ్‌ఆర్‌బీఎంను బైపాస్ చేసి డబ్బులు ఇస్తామని..ఆ తర్వాత భూములు అమ్ముకోవచ్చని ఆ కంపెనీ తెలిపిందన్నారు. దీనికోసం అన్ని చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్‌బీఐ నిబంధనలను తుంగలో తొక్కారని కేటీఆర్ ఆరోపించారు.

“తనకు అండగా నిలబడిన భాజపా ఎంపీకి సీఎం రేవంత్ అనుచిత లబ్ధి చేకూరుస్తున్నారు. కుంభకోణానికి సహకరించిన ఎంపీ పేరు వచ్చే ఎపిసోడ్‌లో బయటపెడతా. నిర్దిష్టమైన ఆధారాలతో కేంద్రానికి లేఖలు రాస్తాను. ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి తెలియకుండా ఇదంతా జరిగిందని అనుకుంటున్నా. రేవంత్‌రెడ్డి తెరతీసింది కేవలం ఈ 400 ఎకరాలకు మాత్రమే కాదు.. రూ.60వేల కోట్ల విలువైన హెచ్‌ఎండీఏ భూముల ద్వారా దోపిడీకి స్కెచ్ వేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలి” అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ!

- ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో సేవల విస్తరణ 40 కిలోమీటర్ల ప్రణాళికకు సీఎం ఆమోదం
- రాజ్య మరియు కేంద్ర ప్రభుత్వ సమన్వయం మెట్రో రెండో దశకు 24269 కోట్ల అంచనాలు
- రీజినల్ రింగ్ రోడ్డు మరియు జాతీయ రహదారుల సమీక్ష సీఎం కొత్త ఆదేశాలు
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి 30,000 ఎకరాల విస్తరణలో మెట్రో కీలక భాగం
- ప్రాజెక్టు కార్యాచరణ కేంద్రంతో అనుమతుల సాధన కోసం ప్రభుత్వం కృషి



మెట్రో రైలు విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ రహదారులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష . ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశం

2లో

## తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల


**తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదలైంది.**

**ఈ కబురు, హైదరాబాద్:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 15 నుంచి 30వరకు టెట్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 9 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉంచుతారు. జులై 22న టెట్ ఫలితాలు విడుదల చేయనున్నారు.

తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు (జూన్, డిసెంబర్) టెట్ పరీక్ష నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.







చెన్నై సూపర్ కింగ్స్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ అలవోక విజయం

6లో



## జ్యోతిబాపూలే విగ్రహానికి

నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి,

2లో



వెనక్కి తగ్గని చైనా.. అమెరికాపై సుంకాలు 125 శాతానికి పెంపు

3లో



ప్రతిపక్షాలకు కుటుంబ ప్రయోజనాలే ముఖ్యం: ప్రధాని

3లో



ఏడాదిన్నర పాలనలో పుష్ప.. హైడ్రా.. మూసీ తప్ప హామీల అమలు లేదు: ఎంపీ అర్వింద్



## బీజేపీ–అన్నా డీఎంకే పొత్తు ఖరారు

**ఈ కబురు,చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో కీలక మలుపు చోటు చేసుకుంది. బీజేపీతో అన్నాడీఎంకే పొత్తు ఖరారైంది. డీఎంకేకాంగ్రెస్

తరువాయి 2లో

## తక్షణమే ఏపీని నిలువరించాలి

### జీఆర్ఎంబీకి తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ లేఖ

**గోదావరి-బనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయం లేఖ రాసింది.**

**ఈ కబురు,హైదరాబాద్:** గోదావరిబనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటి పారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయం లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతలపై ఎలాంటి టెండర్లు చేపట్టకుండా చూడాలని కోరింది. “ఈ నెల 7న జరిగిన సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించాం. గోదావరిబనకచర్ల ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారు. కానీ, మరుసటి రోజే ఏపీ జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఆలస్యం చేయకుండా తక్షణమే ఏపీని నిలువరించాలి”అని లేఖలో పేర్కొంది.










## 14 X 14 అడుగుల సెల్.. 24 గంటల నిఘా: తహవ్వుర్ రాణాను ఎక్కడ ఉంచారంటే..?

**జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న తహవ్వుర్ రాణాను దిల్లీలోని ఎన్ఐఏ భవనంలోని ఒక గదిలో ఉంచారు.**

**ఈ కబురు:** ముంబయి ఉగ్రదాడి కుట్రదారు తహవ్వుర్ రాణా ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉన్నాడు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. నిరంతర నిఘా ఏర్పాటు చేసి అతడి కదలికలను దర్యాప్తు సంస్థ అధికారులు

తరువాయి 2లో



## బీజేపీ– అన్నా డీఎంకే

# పొత్తు ఖరారు

**మొదటి పేజీ తరువాయి**

కూటమికి వ్యతిరేకంగా బీజేపీఅన్నాడీఎంకేలు కూటమిగా కలిసి పోటీచేయడానికి నిర్ణయించాయి. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా స్పష్టం చేశారు.

'ఏడీఎంకే అంతర్గత వ్యవహారంలో మేం జోక్యం చేసుకోం. పొత్తు కోసం ఏడీఎంకే ఎలాంటి షరతులు విధించలేదు. వచ్చ ఎన్నికల్లో కూటమి ఘన విజయం ఖాయం' అని ఆయన వ్యాఖ్యానించారు. 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ రెండు పార్టీలు పొత్తు ఇప్పుడు పెద్ద హాట్ టాపిక్ గా మారింది.

తమిళనాడులో ఎన్డీఏ ప్రభుత్వం ఖాయం ఈ పొత్తులో భాగంగా తమిళనాడు కూటమి సీఎం అభ్యర్థిగా కె పళనిస్వామి అని అమిత్ షా ప్రకటించారు. అమిత్ షా మాట్లాడుతూ.. 1998 నుంచి ఏఐఏడీఎంకే అనేది ఎన్డీఏలో భాగస్వామిగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ.. తమిళనాడు మాజీ సీఎం జయలలితలు ఇద్దరూ కలిసే గతంలో పని చేశారు. ఎన్డీఏ భాగ్వస్వామ్యం అనేది విజయానికి సంకేతం. మా పొత్తుతో మేం మరింత పటిష్టం కానున్నాం. కచ్చితంగా ఇక్కడ ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. తమిళనాడు రాజకీయాల్లో ఊహించని మెజార్టీతో ప్రభుత్వాన్ని చేపడతాం' అని అమిత్ షా పేర్కొన్నారు.




# 14 X 14 అడుగుల సెల్.. 24 గంటల నిఘా: తహవ్వూర్ రాణాను ఎక్కడ ఉంచారంటే..?

**మొదటి పేజీ తరువాయి**

గమనిస్తున్నారు. తమ జ్యుడిషియల్ కస్టడీలో అతడి నుంచి కీలక విషయాలు సేకరించనున్నారు. ఈ క్రమంలో అతడిని ఎక్కడ, ఎలాంటి ఏర్పాట్ల మధ్య ఉంచారంటే..?

తహవ్వూర్ రాణాను ఎన్ఐఏకు అప్పగించడంతో ఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్ ప్రాంతమంతా కట్టుదిట్ట భద్రతలోకి వెళ్లిపోయింది. భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎందుకంటే ఆ కాంప్లెక్స్‌లోనే ఎన్ఐఏ భవనం ఉంది. దాని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గదిలో ఇప్పుడు రాణాను ఉంచారు. 14 X 14 అడుగుల వైశాల్యంలో ఒక చిన్న గదిలో 24 గంటల నిఘా కోసం సీసీ కెమెరాలు అమర్చారు. ఆ గదిలో వివిధ అంచెల్లో డిజిటల్ సెక్యూరిటీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. అతడు పడుకోవడానికి నేలపై బెడ్ వేశారు. ఆ రూమ్‌లోనే బాత్రూమ్ ఏర్పాటు ఉంది. ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు అన్నీ ఆ గదికే వస్తాయని తెలుస్తోంది. అనుమతి లేకుండా ఎవరు లోపలికి వెళ్లడానికి లేదు. కేవలం 12 మంది ఎన్ఐఏ అధికారులకు మాత్రం అనుమతి ఇచ్చారు.

**భారత్‌లో తహవ్వూర్ రాణా.. అప్పగింత తొలి ఫొటో విడుదల**
ముంబయి ఉగ్రదాడి కేసులో నిందితుడిగా ఉన్న తహవ్వూర్ రాణాను భారత్ విజయవంతంగా అమెరికా నుంచి తీసుకురాగలిగింది. గురువారం అర్ధరాత్రి రాణాను ఎన్ఐఏ అధికారులు ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ప్రత్యేక జడ్జి ఎదుట హాజరుపర్చారు. ఆ సమయంలో ఈ కేసుతో సంబంధం లేని వ్యక్తులందరినీ కోర్టు నుంచి బయటకు పంపేశారు. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ ఎన్ఐఏ తరఫున కోర్టులో వాదనలను వినిపించారు. రాణా తరఫున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది పీయూష్ సచ్‌దేవా వాదించారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్‌జిత్ సింగ్ వాదనలు విన్నారు. రాణాను 20 రోజుల పాటు తమ కస్టడీకి అనుమతించాలని ఎన్ఐఏ కోరగా.. 18 రోజుల కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. ప్రస్తుతం అధికారులు అతడిని ప్రశ్నిస్తున్నారు.



# ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రో విస్తరణ!

**ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో సేవలను విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు.**



**మెట్రోను మీర్ ఖాన్ పేట వరకు పొడిగించాలి :**
ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ ఖాన్ పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరం అయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు.

కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలి : హెచ్ఎండీఏ, ఎఫ్ఎస్‌డీఏ (ఫ్యూచర్ సిటీ డెవెలప్‌మెంట్ అథారిటీ)లు సంయుక్తంగా ఈ రూట్ మెట్రో విస్తరణ బాధ్యత తీసుకోవాలని సీఎం అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24269 కోట్ల అంచనాలతో డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారులపై సమీక్ష : రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ సమీపంలోనే భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా డ్రైపోర్ట్ నిర్మాణానికి రూపకల్పన చేయాలని సూచించారు. ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారులపై సీఎం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై దృష్టిసారించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్ఏఐ) పంపించాలని సూచించారు.

**హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరా తీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.**

# జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

**అంబర్పేటలో జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తమ జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే**

**అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారుమహిళలకు విద్యా హక్కు, బాల్య వివాహాలను అరికట్టడానికి పూలే జీవితం అంతా కృషి చేశారు**

**పూలే జీవితం ప్రతిఒక్కరికి స్పూర్తిదాయకం**

**జ్యోతిబాపూలే సతీమణి సావిత్రీబాయి పూలే కూడా గొప్ప సంస్కర్త**

**తెలంగాణ ప్రభుత్వం సావిత్రీబాయి పూలే జయంతిని తెలంగాణలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి ఆమెను గౌరవించుకుంది**

**జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కతో కలిసి స్థల పరిశీలన చేయడం జరిగింది**



**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జ్యోతిరావు పూలే అడుగుజాడల్లోనే నడుస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుంది.**

**బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచింది**

కులగణన నిర్వహించి అభివృద్ధి ఫలాలు బడుగు బలహీన వర్గాలకు దక్కాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ బిల్లు ఆమోదించి చరిత్ర సృష్టించింది.

ఉన్నత న్యాయ స్థానం ఆదేశాల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది.

# ప్రతిపక్షాలకు కుటుంబ ప్రయోజనాలే ముఖ్యం: ప్రధాని

**ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టిసారిస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు.**

**ఈ కబురు,వారణాసి:**
ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఫులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు.



ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' (కుటుంబంతో కలిసి.. కుటుంబం కోసం) అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' (అందరితో కలిసి..అందరి కోసం) నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు.

**గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని పేర్కొన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.**




## ఆర్‌టీఈ అమలుపై అఫిడవిట్ దాఖలు చేయండి..
# రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

**విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది.**

**ఈ కబురు,హైదరాబాద్:**
విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని సామాజిక కార్యకర్త తాండవ యోగేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్‌టీఈ వచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాహక్కు చట్టం అమలులో ఉందని గుర్తుచేశారు. దీని ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని పిటిషనర్ కోరారు.

మరోవైపు గతేడాది అక్టోబర్‌లో విద్యాహక్కు చట్టంపై హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. 202526 విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని అందులో పేర్కొంది. దీని అమలుకు సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.





# అన్నామలై సేవలు భేష్..
## కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు

**తమిళనాడు భాజపా అధ్యక్షుడు కె. అన్నామలైను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు.**

**ఈ కబురు,దిల్లీ:**
తమిళనాడు భాజపా అధ్యక్షుడు కె.అన్నామలైను కేంద్ర హోంమంత్రి అమిత్ షాప్రశంసించారు. తమిళనాడు భాజపా కొత్త అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నయినార్ నాగేంద్రన్ నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై పనితీరు ప్రశంసనీయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలను ప్రజలకు చేరవేయడంలోనైనా, పార్టీ కార్యక్రమాలను గ్రామ గ్రామానికీ తీసుకెళ్లడంలోనైనా ఆయన కృషి అపూర్వమైనదని కొనియాడారు. అన్నామలై సంస్థాగత నైపుణ్యాలను పార్టీ జాతీయ స్థాయిలో వినియోగించుకుంటుందని పేర్కొన్నారు.

**14 X 14 అడుగుల సెల్.. 24 గంటల నిఘా: తహవ్వుర్ రాణాను ఎక్కడ ఉంచారంటే..?**

**తమిళనాడు పార్టీ కొత్త అధ్యక్షుడిగా నాగేంద్రన్?**

మరోవైపు, తమిళనాడు భాజపా అధ్యక్ష ఎన్నికల బరిలో ఈసారి ఉండబోనని ఇటీవల అన్నామలై ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పదవికి తిరునల్వేలి భాజపా ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. టి.నగర్‌లోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి విచ్చేసి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలుచేయడంతో ఎన్నిక లాంఛనమేనని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి నాగేంద్రన్ పేరును కె.అన్నామలై, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్‌తో పాటు, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ప్రతిపాదించారు.

## ఏడాదిన్నర పాలనలో పుష్ప..
## హైడ్రా.. మూసీ తప్ప హామీల అమలు లేదు: ఎంపీ అర్వింద్

**తెలంగాణలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తోందని.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీరో పరిపాలన సాగుతోందని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు.**

**ఈ కబురు,హైదరాబాద్:**
తెలంగాణలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తోందని.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీరో పరిపాలన సాగుతోందని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో పుష్ప, హైడ్రా, మూసీ, హెచ్‌సీయూ మీద పడ్డారు తప్పితే ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఎంపీ అర్వింద్.. ప్రభుత్వ పరిపాలనా తీరుపై విమర్శలు గుప్పించారు.



''ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, విద్యా భరోసా కార్డు, చేయూత, ఆరోగ్యశ్రీ, లక్ష రూపాయలు, తులం బంగారం.. ఇలా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక తూము కట్టలేదు. సీఎం రేవంత్ రెడ్డి గ్రాఫ్ పడిపోతోంది. మాజీ సీఎం కేసీఆర్ పక్కన ఉన్న దొంగలే రేవంత్ రెడ్డి పక్కనా ఉన్నారు. రేవంత్ రెడ్డిని కేసీఆర్ జైలులో వేస్తే.. రేవంత్ కనీసం ప్రయత్నం కూడా చేయడం లేదు. ప్రతిపక్షం ఫామ్‌హౌస్‌లో పడుకుంది. ప్రతిపక్ష పదవి ఎందుకు తీసుకున్నారు?కేసీఆర్ వ్యవస్థను విధ్వంసం చేసి దోచుకుతిన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి భయపెట్టిస్తున్నారు.. బుల్డోజర్లు పంపిస్తున్నారు. భాజపా నేతలను తెలంగాణలో కాళ్లు పెట్టనివ్వనని రేవంత్ రెడ్డి అహ్మదాబాద్‌లో అన్నారు. లేటెస్టుగా మల్క కొమురయ్య, అంజిరెడ్డి కాళ్లు పెట్టారు. ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేసి దిల్లీకి పంపడం తప్పితే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్ కుటుంబం మీద చర్యలు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డిని మార్చాలని అధిష్ఠానం చూస్తోంది'' అని అర్వింద్ పేర్కొన్నారు.

## కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను
# తన వారికి కట్టబెట్టింది: మహేశ్‌కుమార్‌గౌడ్

**పదేళ్ల పాలనలో గత భారాస ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.**

**ఈ కబురు,హైదరాబాద్:**
పదేళ్ల పాలనలో గత భారాస ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను తన వారికి కట్టబెట్టిందని విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు.

''గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాలను కేసీఆర్.. తన వారికి అప్పనంగా అమ్ముకున్నారు. కంచ గచ్చిబౌలి భూముల గురించి పదేళ్లలో ఎందుకు పోరాడలేదు. హెచ్‌సీయూ భూములైతే.. కోర్టు వివాదంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదు? ఐఎంజీ సంస్థ బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకొని భూముల గరించి పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 400 ఎకరాలను సాధించాం. ఈ ప్రభుత్వం కాపాడకుంటే 400 ఎకరాల భూమి ఐఎంజీ చేతికి వెళ్లి ఉండేది. బిల్లీరావుతో మాట్లాడుకున్న రూ. వేల కోట్ల కమీషన్ పోయిందనే అక్కసుతోనే కేటీఆర్ మాట్లాడుతున్నారు.



**ఏ ప్రభుత్వం అయినా ఒక సంస్థ ద్వారానే రుణాలు సేకరిస్తుంది. కోకాపేటలో వేల ఎకాలను రూ.100 కోట్లకు ఎకరం చొప్పన అమ్ముకోలేదా? టీజీఐఐసీ ద్వారా తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలతో రైతులకు రుణమఫీ చేసింది ఈ ప్రభుత్వం. భారాస ప్రభుత్వం వేల ఎకరాలు అమ్ముకున్నప్పుడు పర్యావరణం గుర్తుకురాలేదా? పదేళ్లలో లక్ష ఎకరాలను డీఫారెస్ట్ చేసి అమ్ముకున్నారు. 400 ఎకరాల భూముల్లో కంపెనీలు నిర్మిస్తే.. రాష్ట్ర ప్రజలకు లక్షల ఉద్యోగాలు వస్తాయి. పదేళ్లలో భారాస చేసిన భూదోపిడీపై బహిరంగ చర్చకు కేటీఆర్ సిద్ధమా?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు.**

# వెనక్కి తగ్గని చైనా..
# అమెరికాపై సుంకాలు 125 శాతానికి పెంపు

**అమెరికా-చైనా మధ్య ట్రేడ్ ఉద్రిక్తతలు తీవ్రం అవుతున్నాయి. ట్రంప్ దూకుడుకు డ్రాగన్ దీటుగా స్పందిస్తోంది.**

**ఈ కబురు:** అమెరికా, చైనా ల మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులను డ్రాగన్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచితే.. డ్రాగన్ నుంచి అదే రియాక్షన్ వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది.

చైనాపై విధించిన సుంకాలను మొత్తంగా లెక్కిస్తే 145శాతంగా ఉంటాయని గురువారం శ్వేతసౌధం కార్యనిర్వాహక ఉత్తర్వు వెల్లడించింది. ఈ నేపథ్యంలో తాము విధించిన 84 శాతం సుంకాలను 125 శాతానికి పెంచుతూ తాజాగా చైనా ప్రకటించింది. శనివారం నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిని ఒక నంబర్ గేమ్‌గా అభివర్ణించిన మంత్రిత్వ శాఖ.. ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించింది. ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది. చైనా వస్తువులపై విధించిన పరస్పర సుంకాలను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలని కోరింది.



**ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. వాషింగ్టన్ సుంకాలపై బీజింగ్ ప్రపంచ వాణిజ్య సంస్థలో దావా వేయనున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా విధించిన సుంకాలపై చైనా ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయి. అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.**

### ట్రంప్ టారిఫ్‌ల వేళ..
### జిన్‌పింగ్ ఫస్ట్ రియాక్షన్

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై టారిఫ్‌ల మోత మోగిస్తున్నారు. ఈనేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తొలిసారి స్పందించినట్లు డ్రాగన్ ప్రభుత్వ మీడియా సంస్థ జిన్హువా పేర్కొంది. అమెరికా విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపుగా జిన్‌పింగ్ అభివర్ణించారు. బెదిరింపులను ప్రతిఘటించడానికి ఐరోపా యూనియన్ తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సి ఉందన్నారు. అప్పుడే తమ సొంత చట్టబద్ధ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందన్నారు. అంతేగాకుండా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కాపాడొచ్చని చెప్పారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.**

**సుంకాలపై అమెరికాతో తీవ్రంగా తలపడుతున్న చైనా కాస్త వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. బెదిరింపులకు తలొగ్గబోమంటూనే చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే.. తుదివరకూ తామూ పోరాడతామని చైనా వాణిజ్యశాఖ అధికార ప్రతినిధి యాంగ్‌కియాన్ పేర్కొన్నారు. 'చైనాతో డీల్ చేయాలంటే.. ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్లు సరైన మార్గం కాదు. రెండు దేశాలు కలిసి కూర్చుని విభేదాల పరిష్కారానికి కృషి చేస్తాయని ఆశిస్తున్నాం. పరస్పర గౌరవం అనే సిద్ధాంతాల ఆధారంగా చర్చలు జరగాలి' అని యాంగ్‌కియాన్ అన్నారు.**

# ప్రయాణంలో రైలు టికెట్ చిరిగిపోతే ఫైన్ కట్టాలా?

**రైలులో ప్రయాణిస్తున్నప్పుడు కొన్ని కారణాలతో ప్రయాణికుల టికెట్ చిరిగిపోతూ ఉంటుంది. లేదా ఇంకొన్ని సందర్భాల్లో టికెట్ ఎక్కడో పడిపోతుంది. అలాంటప్పుడు వేరే టికెట్ తీసుకోవాలా? లేదా అప్పటికే ప్రయాణంలో ఉంటే రైలు నుంచి దింపేస్తారా? అనే అనుమానం ఎప్పుడైనా వచ్చిందా.. అయితే రైల్వే నిబంధనల ప్రకారం అలాంటి సందర్భంలో టీటీఈ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్) ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో.. ప్రయాణికులు అందుకు అనుగుణంగా ఎలా స్పందించాలో కింద తెలుసుకుందాం.**




టికెట్ లేకుండా ప్రయాణం చేయడం చట్టరీత్యా నేరం. ఒకవేళ అసలు టికెట్ తీసుకోకుండానే ప్రయాణం చేసే టీటీఈకి పట్టుబడితే పూర్తి టికెట్ ఛార్జీతో పాటు అదనపు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇది కనీసం రూ.250 లేదా టికెట్ మొత్తానికి రెట్టింపు ఉంటుంది. ఒకవేళ ఆ మొత్తం చెల్లించలేకపోతే టీటీఈ తదుపరి స్టేషన్‌లో దింపి రైల్వే పోలీసులకు అప్పగించే అధికారం ఉంది. కొన్నిసార్లు ప్రయాణికులు రైలు ఎక్కిన తర్వాత టికెట్ కొనాలనుకుంటారు. ఇది సాధ్యమే, కానీ ఖాళీ సీటు అందుబాటులో ఉండాలి. అందుకోసం సాధారణ ఛార్జీల కంటే అదనంగా రుసుము వసూలు చేస్తారు.

**పోయిన లేదా చిరిగిన టిక్కెట్లు**

ప్రయాణంలో మీ టికెట్ పోయినట్లయితే లేదా చిరిగిపోతే మిమ్మల్ని టికెట్ లేని ప్రయాణికుడిగా పరిగణించరు. మీరు టీటీఈ నుంచి డూప్లికేట్ టికెట్ పొందవచ్చు. కానీ అప్పటికే మీరు పోయిన టికెట్‌కు డబ్బు చెల్లించినప్పటికీ కొత్తగా తీసుకునే టికెట్‌ను ఉచితంగా అందించరు. అందుకు నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలి. వెరిఫికేషన్ కోసం మీ ఐడీని చూపించాల్సి ఉంటుంది. మొబైల్‌లో ఆన్‌లైన్ టికెట్ అందుబాటులో ఉంటే డూప్లికేట్ టికెట్ అవసరం లేదు. మొబైల్‌లో మీ ఈటికెట్‌ను టీటీఈకి చూపించవచ్చు. అది చెల్లుబాటు అవుతుంది.

**రైలు ఆలస్యమైతే రీఫండ్**
**భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం మీరు ప్రయాణించాలనుకున్న రైలు 3 గంటలు లేదా అంతకంటే ఎక్కువ ఆలస్యమైతే టికెట్ ఛార్జీలు రీఫండ్ పొందవచ్చు. ఇందుకోసం టీడీఆర్ (టికెట్ డిపాజిట్ రసీదు) దాఖలు చేయాలి. రైలు ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి (దొంగతనం లేదా దాడి వంటివి) జరిగితే రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కు కాల్ చేయవచ్చు లేదా టీటీఈ లేదా రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.**




## మైక్రోసాఫ్ట్‌లో మరోమారు లేఆఫ్స్!.. ఎఫెక్ట్ వారిపైనే..

**టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. మరోమారు ఉద్యోగులను తొలగించడానికి సన్నద్ధమవుతోంది. ప్రాజెక్ట్ బృందాలలో ఇంజనీర్ల నిష్పత్తిని పెంచే ప్రయత్నంలో భాగంగా ఈ కోతలు ఉంటాయి. ఈ ప్రభావం వల్ల ప్రధానంగా మిడిల్ మేనేజ్‌మెంట్, నాన్-టెక్నికల్ ఉద్యోగులు ఉద్యోగం కోల్పోయే అవకాశం ఉంది. మే నెలలో ఈ లేఆఫ్స్ ఉండే అవకాశం ఉంది. ఎయితే ఈ ఎఫెక్ట్ ఎంతమందిపై ప్రభావం చూపుతుందని విషయం అధికారికంగా వెల్లడికాలేదు.**

అమెజాన్, గూగుల్ కంపెనీల మాదిరిగానే.. మైక్రోసాఫ్ట్ కూడా నిర్వాహక పాత్రల కంటే సాంకేతిక ప్రతిభకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ లేఆఫ్స్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీ ఆదాయ, వ్యయాలను సమతుల్యం చేయడమే లక్ష్యంగా మైక్రోసాఫ్ట్ ఈ నిర్ణయం తీసుకుంది.

మైక్రోసాఫ్ట్ గతంలో కూడా.. తక్కువ పనితీరు కనపరచిన 2,000 మంది ఉద్యోగులను తొలగించింది. దీన్ని బట్టి చూస్తుంటే.. త్వరలో జరగనున్న ఉద్యోగాల తొలగింపు ప్రభావం కూడా పనితీరు తక్కువగా ఉన్న ఉద్యోగుల మీదనే పడే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. దీనికి సంబంధించిన విషయాలు త్వరలోనే అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

**ఏఐలో శిక్షణ**

భవిష్యత్ ఆవిష్కరణలలో ఏఐ కీలకం. కాబట్టి 2030 నాటికి 10 మిలియన్ల (కోటి మందికి) మందికి ఏఐలో శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని గూగుల్ సీఈఓ సత్యనాదెళ్ళ గతంలోనే వివరించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధిపత్యం చెలాయిస్తోంది. దీనిని మరింత అభివృద్ధి చేయడానికి, తమ ఉద్యోగులకు కూడా ఇందులో శిక్షణ ఇవ్వడానికి దిగ్గజ సంస్థలు సన్నద్ధమవుతున్నాయి.

## రూ. లక్షకు చేరువలో బంగారం ఇక గోల్డ్ కొనడం కష్టమే?

**దేశంలో బంగారం ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. గురువారం గరిష్టంగా రూ. 2940 పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు (ఏప్రిల్ 11) రూ. 2020 పెరిగి ఒక్కసారిగా షాకిచ్చింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం.**



హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 87,450 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 95,400 వద్ద నిలిచాయి. నిన్న మాదిరిగానే ఈ రోజు కూడా రూ. 1850 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 2020 (24 క్యారెట్స్ 10గ్రా) పెరిగింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి.

చైన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 1850, రూ. 2020 పెరిగింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 87,450 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 95,400 వద్ద ఉంది.

దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 87,600 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 95,550 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 1850, రూ. 2020 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు కొంత ఎక్కువగానే ఉంది.

**వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు కూడా కొంత పెరుగుదలవైపు అడుగులు వేసాయి. ఈ రోజు (ఏప్రిల్ 10) కేజీ సిల్వర్ రేటు రూ. 1,08,000 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 97,100 వద్ద ఉంది.



## టెస్లా కొత్త సైబర్‌ట్రక్ విడుదల.. ధర ఎంతంటే..

**ప్రముఖ అమెరికా ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా యూఎస్‌లో కొత్త సైబర్‌ట్రక్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను 69,990 అమెరికన్ డాలర్లుగా(రూ.59 లక్షలు) నిర్ణయించింది. ఇది ప్రస్తుతం అందుబాటులో ఉన్న మూడు సైబర్‌ట్రక్ మోడళ్లలో చౌకైనదిగా కంపెనీ పేర్కొంది. కొత్త సైబర్‌ట్రక్ వేరియంట్‌కు సంబంధించిన రేంజ్, టోవింగ్ సామర్థ్యం, యాక్సిలరేషన్ వంటి స్పెసిఫికేషన్లపై కచ్చితమైన వివరాలు వెల్లడించలేదు.**

అమెరికాలో 69,990 డాలర్ల ధరతో ఎంట్రీ లెవల్ సైబర్‌ట్రక్ యూఎస్ మార్కెట్‌లో ఆదరణ పొందుతున్న ఫోర్డ్ ఎఫ్150 లైటనింగ్, రివియన్ ఆర్ 1 టీ వంటి ఇతర ఎలక్ట్రిక్ మోడళ్లతో పోటీ పడుతుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్టెయిన్‌లెస్ స్టీల్ ఎక్సోస్కెలెటన్, ఆర్మర్డ్ గ్లాస్, అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ సామర్థ్యాలు సైబర్‌ట్రక్‌లో ఉన్నాయని కంపెనీ తెలిపింది.

ఈవీ విభాగంలో టెస్లా ఆధిపత్యాన్ని కొనసాగించడానికి కంపెనీ కొంత కాలంగా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీనికి తోడు ఆర్థిక అనిశ్చితి, ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ హెచ్చుతగ్గులుండడం వాహన తయారీదారులు ధరలకు సంబంధించి పునరాలోచనలో పడేలా చేశాయి. ఈ నేపథ్యంలో టెస్లా తీసుకున్న నిర్ణయం వినియోగదారులు మరింత సరసమైన ధరలకు కార్లను కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు.. దూసుకెళ్లిన సూచీలు





**దేశీయ స్టాక్‌మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా మినహా చాలా దేశాలపై వాణిజ్య సుంకాలకు 90 రోజుల విరామం ప్రకటించిన తరువాత మిశ్రమ ఆసియా ధోరణుల మధ్య భారత ఈక్విటీ మార్కెట్లు భారీ ర్యాలీని చూశాయి.**

బీఎస్‌ఈ సెన్సెక్స్ 1310.11 పాయింట్లు (1.77 శాతం) లాభపడి 75,157.26 వద్ద స్థిరపడగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 429.40 పాయింట్లు లేదా 1.92 శాతం పెరిగి 22,828.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 షేర్లలో 47 షేర్లు లాభాల్లో ముగియగా, హిండాల్కో 6.52 శాతం, టాటా స్టీల్ 4.84 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4.81 శాతం, కోల్ ఇండియా 4.51 శాతం, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ 4.43 శాతం లాభాలతో టాప్ గెయినర్లుగా ఉన్నాయి.

విస్తృత మార్కెట్లలో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ 1.84 శాతం, స్మాల్ క్యాప్ 3.04 శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే అన్ని రంగాల సూచీలు లాభాల్లో స్థిరపడ్డాయి. అత్యధికంగా నిఫ్టీ మెటల్, ఎనర్జీ, ఫార్మా, ఆటో, బ్యాంక్ 4.09 శాతం వరకు లాభపడ్డాయి.

అమెరికా వస్తువులపై సుంకాలను శనివారం నుంచి 125 శాతానికి పెంచుతున్నట్లు చైనా ప్రకటించిన నేపథ్యంలో వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతలు పెరగడంతో జపాన్ కు చెందిన నిక్కీ 225, దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ, సింగపూర్ కు చెందిన స్ట్రెయిట్స్ టైమ్స్ సహా ఆసియా మార్కెట్ల సూచీలు నష్టాలలో ముగిశాయి. అంతకు ముందు చైనా దిగుమతులపై సుంకాన్ని 145 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.



# ఒకర్ని తిడితే కానీ మీకు రోజు గడవదా? మీకు నిద్రెలా పడుతుంది?


**సెలబ్రిటీలను ట్రోల్ చేయడం ఈ మధ్య చాలామందికి ఆటవిడుపుగా మారింది. వారేం చేసినా, చేయకపోయినా.. ప్రతి చిన్నదానికి విమర్శిస్తూనే ఉన్నారు. తాజాగా ఈ ట్రోలింగ్ బ్యాచ్ హీరోయిన్ త్రిష మీద పడ్డారట! ఈమె కథానాయికగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాలో ఆమె పాత్ర చూసి కొందరు యావరేజ్‌గా ఉందని పెదవి విరిచారు.**

**అర్థం కావట్లే..**

అక్కడితో ఆగకుండా తనపై విద్వేషపూరిత కామెంట్లు చేశారు. అవన్నీ చూసి భరించలేకపోయింది త్రిష . ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ట్రోలర్‌స్‌కు గడ్డి పెట్టే ప్రయత్నం చేసింది. కొందరు మనుషులకు ఒళ్లంతా విషమే! మీకు నిద్రెలా పడుతుంది? ఇంత హాయిగా ఎలా బతుకుతున్నారో నాకర్థం కావడం లేదు. ఎంతసేపూ సోషల్ మీడియాకు వచ్చి అర్థంపర్థం లేని పనులు చేస్తూ అడ్డదిడ్డంగా పోస్టులు పెట్టమే మీ పనా? అవతలివారిని విమర్శిస్తేగానీ మీకు రోజు గడవదా? మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా భయమేస్తోంది. మీ చుట్టూ ఉన్నవాళ్లు ఎలా బతుకుతున్నారో? ఏంటో? పిరికిపందల్లారా.. ఆ దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలని కోరుకుంటున్నాను అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ వేదికగా అసహనం వ్యక్తం చేసింది.

**సినిమా..**

గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా విషయానికి వస్తే.. అజిత్ హీరోగా నటించిన ఈ సినిమాలో అర్జున్ దాస్, ప్రసన్న, కార్తికేయ దేవ్, ప్రభు, ప్రియ ప్రకాశ్ వారియర్, సునీల్, రాహుల్ దేవ్, రెడిన్ కింగ్‌స్లీ కీలక పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మించింది. జీవీ ప్రకాశ్ సంగీతం అందించాడు. అజిత్‌తో ఇది త్రిషకు ఆరో సినిమా కావడం విశేషం. గతంలో వీరి కాంబినేషన్‌లో జి, కిరీడం, మంకత, ఎన్నై అరిందల్, విదాముయర్చి సినిమాలు వచ్చాయి.



# 'హరిహర..' రిలీజ్ సంగతేంటి?

**పవన్ కల్యాణ్ సినిమా మరో నెలలో రిలీజ్ అవుతుంది. అవును మీరు విన్నది నిజమే. అదే 'హరిహర వీరమల్లు'. అసలు హైప్ లేదు, దానికి తోడు రిలీజ్ డేట్ పై అనుమానాలు. అయినా సరే చెప్పిన తేదీకే వస్తామని నిర్మాతలు ప్రకటించారు. దీన్ని ఎంతవరకు నమ్మొచ్చు? అసలేం జరుగుతోంది?**

**అప్పుడెప్పుడో రీఎంట్రీ తర్వాత పవన్ ఒప్పుకొన్న సినిమా హరిహర వీరమల్లు. ప్రకటించినప్పుడు మంచి హైప్ ఏర్పడింది. పీరియాడికల్ సబ్జెక్ట్, క్రిష్ దర్శకుడు కావడంతో ఓ మాదిరి అంచనాలు ఏర్పడ్డాయి. కానీ పవన్ మిగతా మూవీస్ చేశాడు. అవి రిలీజైపోయాయి. ఏళ్లు గడిచిపోయాయి. కానీ హరిహర.. విషయంలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.**

**అనివార్య కారణాల వల్ల క్రిష్.. సినిమా నుంచి తప్పుకొన్నాడు. నిర్మాత ఏఎం రత్నం కొడుకు జ్యోతికృష్ణ.. దర్శకత్వ బాధ్యతలు అందుకున్నాడు. తర్వాత షూటింగ్ మొదలుపెట్టడం పవన్ రాకపోవడం వల్ల ఎటూ కదల్లేదు. లెక్క ప్రకారం మార్చి 27న రిలీజ్ అన్నారు. కానీ షూటింగ్ పెండింగ్, గ్రాఫిక్స్ వర్క్ జరగాల్సి ఉండటంతో మే 9కి వాయిదా వేశారు.**

**విడుదలకు మరో నెలరోజులు కూడా లేదు. అయినా సరే సినిమా రిలీజ్ పై అనుమానాలు వెంటాడుతున్నాయి. ఎందుకంటే పవన్.. ఇంకో 4 రోజులు షూటింగ్ లో పాల్గొనాలట. దానికి తోడు గ్రాఫిక్స్ వర్క్స్ పూర్తి చేయాలి. వీటితో పాటు ప్రమోషన్స్ చేయాలి. మరి ఇవన్నీ నెలలోపు పూర్తి చేసి రిలీజ్ చేస్తారా అనేది చూడాలి.**

**మరోవైపు ఓటీటీ డీల్ గురించి కొన్ని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈసారి గనుక రిలీజ్ చేయకపోతే అమెజాన్ ప్రైమ్.. డీల్ క్యాన్సిల్ చేసుకునే అవకాశముందంటున్నారు. మరి 'హరిహర వీరమల్లు' ఈసారైనా థియేటర్లలోకి వస్తాడా? వాయిదాకి మొగ్గుచూపుతాడా అనేది చూడాలి.**

# మైత్రీ తీసిన 'జాట్'.. తొలిరోజు వసూళ్ల పోస్టర్ రిలీజ్

**తెలుగులో ప్రముఖ నిర్మాణ సంస్థలైన మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా నిర్మాణ సంస్థలు కలిస నిర్మించిన హిందీ సినిమా 'జాట్'. సన్నీ డియోల్ హీరోగా నటించిన ఈ చిత్రం.. నిన్న (ఏప్రిల్ 10) థియేటర్లలోకి వచ్చింది. మరి తొలి రోజు వసూళ్లు ఎంతొచ్చాయి? టాక్ ఏం వినిపిస్తుంది.**

తెలుగులో ఎన్నో సినిమాల్లో కనిపించిన ఓ మాస్ కథతో తీసిన మూవీ జాట్. ఓ ఊరు మొత్తాన్ని వేధించే విలన్, అనుకోకుండా అక్కడ ల్యాండ్ అయిన హీరో, అనుకోని పరిస్థితుల్లో వీళ్లిద్దరి మధ్య ఫైటింగ్, చివరకు ఏమైందనేదే స్టోరీ.

హిందీలో ఈ మధ్య సౌత్ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో తెలుగు ఫ్లేవర్ కథతో జాట్ తీశారు. టాక్ అయితే పాజిటివ్ వచ్చింది. దీంతో తొలిరోజు రూ.11.6 కోట్ల మేర గ్రాస్ వసూళ్లు వచ్చాయి. ఇది తక్కువ కానప్పటికీ.. సన్నీ గత చిత్రం 'గదర్ 2'తో పోలిస్తే చాలా తక్కువ. ఎందుకంటే ఆ మూవీకి తొలిరోజు రూ.40 కోట్లు వచ్చాయి. ప్రస్తుతానికి హిందీలో మాత్రమే రిలీజ్ చేశారు. తెలుగులోనూ విడుదల చేస్తారనే టాక్ వచ్చింది. మరి ఈ వీకెండ్ గడిస్తే జాట్.. బాక్సాఫీస్ జాతకం ఏంటనేది బయటపడుతుంది. తెలుగు వెర్షన్ రిలీజ్ గురించి ఓ క్లారిటీ వస్తుందేమో!



# ఇక చంద్రుడే కనిపిస్తాడు!

నేషనల్ క్రష్ అని రష్మికా మందన్నాను అభిమానులు ఎంతో అభిమానంగా పిలుచుకుంటారు. ఈ బ్యూటీ ఇన్‌స్టా స్టోరీస్, ఇన్‌స్టాపోస్ట్‌లు ఫాలో అయ్యేవారికి మరో రెండు రోజుల పాటు ఈపోస్ట్‌లలో ఎక్కువగా చంద్రుడే కనిపిస్తాడు. లేకపోతే... రాత్రివేళ వెలుగులు జిమ్మే కెమేరా లైట్స్ లేదా కనిపించని నక్షత్రాలు మాత్రమే ఉంటాయి. ఈ విషయాన్ని రష్మికా మందన్నాయే చెప్పారు.

ఇంతకీ విషయం ఏంటంటే... ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా లీడ్ రోల్స్‌లో హిందీలో 'థామా' అనే హారర్ మూవీ రూపొందుతోంది. ఈ సినిమాకు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా నైట్ షూట్ జరుగుతోంది. మరో రెండు రోజుల పాటు ఈ నైట్ షూట్ కొనసాగుతోంది.

అందుకే తన ఇన్‌స్టా స్టోరీస్,పోస్ట్‌లలో 'చందమామ లేదా కెమేరా లైట్స్ లేదా కనిపించని నక్షత్రాలు మాత్రమే'(ప్రస్తుతం మేం ఉన్న సిటీలో ఇవి కనిపించడం అసాధ్యం) తన ఇన్‌స్టాలో షేర్ చేస్తానన్నట్లుగా రష్మికపోస్ట్ చేశారు. కాగా ఈ సినిమాలో ఆమె పాత్ర వినూత్నంగా ఉంటుందని, యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయని టాక్. ఇక ఈ చిత్రం ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ కానుంది.





# నషా అంటూ ఐటం సాంగ్‌లో చిందేసిన తమన్నా..

**మిల్కీ బ్యూటీకి డ్యాన్స్ చేయడమంటే మహా ఇష్టం. అందుకే ఐటం సాంగ్స్ ఆఫర్ వచ్చినప్పుడు డ్యాన్స్‌కు స్కోప్ ఉంటోందని వెంటనే ఓకే చెప్పేస్తోంది. అలా జైలర్‌లో నువ్వు కావాలయ్యా.., స్త్రీ 2లో ఆజ్ కా రాత్.. పాటతో సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేసింది. తాజాగా రైడ్ 2లోని నషా పాటకు చిందేసింది. రైడ్ 2లో తమన్నా భాటియా ఐటం సాంగ్ చేస్తున్నట్లు ఇటీవల కొన్ని ఫోటోలు లీకయ్యాయి.**

**మరో ఐటం సాంగ్..**

దీంతో చిత్రయూనిట్ ఎలాంటి సస్పెన్స్‌లు లేకుండా నషా పాటను విడుదల చేసింది. ఎప్పటిలాగే తమన్నా తన ఎక్స్‌ప్రెషన్స్‌తో, స్టెప్పులతో అదరగొట్టేసింది. ఆజ్ కీ రాత్ సాంగ్‌కు కొరియోగ్రఫీ చేసిన విజయ్ గంగూలీయే ఈ పాటకు కొరియోగ్రఫీ చేశారు. రైడ్ 2 విషయానికి వస్తే.. 2018లో వచ్చిన సూపర్ హిట్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్ కథానాయకుడిగా, వాణీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. రితేశ్ దేశ్‌ముఖ్ విలన్‌గా యాక్ట్ చేశారు. మే 1న ఈ సినిమా రిలీజ్ కానుంది.



## తేలిపోయిన చెన్నై బ్యాటర్లు..
# కోల్‌కతా లక్ష్యం 104

**ఐపీఎల్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్‌స్‌తో జరుగుతోన్న మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ బ్యాటర్లు విఫలమయ్యారు.**

**చెన్నై:** ఐపీఎల్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్‌స్‌తో జరుగుతోన్న మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులు మాత్రమే చేశారు. ఈ సీజన్‌లో చెన్నై జట్టుకు తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించిన ధోనీ(1) నిరాశపర్చాడు. శివమ్(31), విజయ్ శంకర్(26) జట్టును ఆదుకున్నారు. మిగతా బ్యాటర్లలో రచిన్ 4, కాన్వే 12, రాహుల్ త్రిపాఠి 16, అశ్విన్ 1, జడేజా 0, దీపక్ హుడా 0, నూర్ అహ్మద్ 1, అన్షుల్ 3 పరుగులు చేశారు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ 2, హర్షిత్ రాణా 2, అలీ 1, వైభవ్ 1 చొప్పున వికెట్లు పడగొట్టారు.



## స్ట్రైక్ రొటేట్ చేయడమే గగనమైంది.. తప్పక చర్చిస్తాం: పిచ్ క్యూరేటర్‌పై డీకే అసంతృప్తి

**ఐపీఎల్-2025 లో ఫ్రాంచైజీలు వర్సెస్ క్యూరేటర్లు అన్నట్లుగా వివాదాలు పుట్టుకొస్తున్నాయి. తొలుత కోల్‌కతా నైట్ రైడర్స్ఈడెన్ గార్డెన్స్ పిచ్ క్యూరేటర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా.. ఇప్పుడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వంతు వచ్చింది.**

**టీ20 క్రికెట్ అంటేనే పరుగుల వరద**

చిన్నస్వామి స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమి తర్వాత ఆర్సీబీ బ్యాటింగ్ కోచ్ దినేశ్ కార్తిక్.. క్యూరేటర్ తీరును విమర్శించాడు. “టీ20 క్రికెట్ అంటేనే పరుగుల వరద. లీగ్ ప్రచారకర్తలు, అభిమానులకు ఇదే ముఖ్యం. అభిమానులంతా బ్యాటర్లు బౌండరీలు బాదుతుంటే చూడాలని కోరుకుంటారు.

ఇక్కడ తొలి రెండు మ్యాచ్‌ల కోసం మేము బ్యాటింగ్‌కు ఎక్కువగా అనుకూలించే పిచ్‌లు రూపొందించమని విజ్ఞప్తి చేశాం. కానీ.. చిన్నస్వామి స్టేడియంలో బ్యాటింగ్ చేయడమే కష్టంగా మారిపోయింది.

ఈ పిచ్ బ్యాటర్లకు అంతగా అనుకూలించడం లేదు. ఈ వికెట్‌పై పరుగులు రాబట్టడం సవాలుతో కూడుకున్న పని. మేము ఇక్కడ ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ ఇదే పరిస్థితి.

స్ట్రైక్ రొటేట్ చేయడం కూడా కష్టమైపోయింది. ఇక ఇలాంటి చోట భారీ షాట్ ఆడాలంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయితే, టీ20 క్రికెట్‌లో షాట్లు బాదితేనే ఆడేవాళ్లకు, చూసేవాళ్లకు మజా.

**తప్పక చర్చిస్తాం**

పిచ్ తప్పకుండా మేము క్యూరేటర్‌తో చర్చిస్తాం. ఆయనపై మాకు నమ్మకం ఉంది. మాకోసం అత్యుత్తమ పిచ్ తయారు చేస్తారని ఆశిస్తున్నాం” అని దినేశ్ కార్తిక్ పేర్కొన్నాడు.

**పాటిదార్ నాయకత్వంలో రచ్చ గెలుస్తూ.. ఇంట ఇలా**

కాగా ఐపీఎల్2025లో ఆర్సీబీకి కొత్త కెప్టెన్ వచ్చాడు. రజత్ పాటిదార్ నాయకత్వంలో ఆర్సీబీ ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకుని మూడు గెలిచింది. అయితే, ఈ మూడూ ఇతర వేదికలపై గెలిచినవే. సొంత మైదానం చిన్నస్వామి స్టేడియంలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ బెంగళూరు జట్టుకు చేదు అనుభవమే మిగిలింది.

తొలుత గుజరాత్ టైటాన్స్ చేతిలో.. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో సొంతగడ్డపై పాటిదార్ సేన ఓటమిపాలైంది. గురువారం నాటి మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ... నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది.

**రహానే డైరెక్ట్‌గానే**

ఇక ఢిల్లీ 17.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి.. లక్ష్యాన్ని ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, కర్ణాటక బ్యాటర్ కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 93 నాటౌట్) ఒంటి చేత్తో ఢిల్లీ జట్టును గెలిపించాడు. ఈ నేపథ్యంలో తీవ్ర నిరాశకు గురైన ఆర్సీబీ మేనేజ్‌మెంట్ ఈ మేరకు పిచ్ క్యూరేటర్‌ను తప్పుబట్టడం గమనార్హం.

ఇక కేకేఆర్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. హోం గ్రౌండ్‌లో కాస్త అడ్వాంటేజీ ఉంటుందనుకుంటే.. అక్కడే డిఫెండింగ్ చాంపియన్‌కు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. స్పిన్‌కు కాస్త అనుకూలించే పిచ్ తయారు చేయమని అడిగితే.. క్యూరేటర్ తమ మాట వినడం లేదంటూ కోల్‌కతా కెప్టెన్ అజింక్య రహానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.

## చెన్నై సూపర్ కింగ్స్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్
# అలవోక విజయం

**చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ 8 వికెట్ల తేడాతో అలవోకగా విజయం సాధించింది.**

చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ 8 వికెట్ల తేడాతో అలవోకగా విజయం సాధించింది. 104 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా.. 10.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కేకేఆర్ బ్యాటర్లు సునీల్ నరైన్ (44), డికాక్ (23) రాణించారు. చెన్నై బౌలర్లలో అన్షుల్, నూర్ అహ్మద్ చెరో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ఓడిపోవడంతో ఈ సీజన్‌లో చెన్నై జట్టుకు ఇది వరుసగా ఐదో ఓటమి కావడం గమనార్హం.



**దంచికొట్టిన నరైన్..**

స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఆడుతూ పాడుతూ ఛేదించింది. చెన్నై ఇన్నింగ్స్‌ను కకావికలం చేసిన సునీల్ నరైన్.. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టాడు. తొలి ఓవర్ చివరి బంతికి సిక్స్ బాది ఖాతా తెరిచిన అతడు.. ఆతర్వాత సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ డికాక్ (23: 16 బంతుల్లో 3 సిక్స్‌లు) ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. రెండో ఓవర్ తొలి బంతికి సిక్స్ బాదిన డికాక్.. ఖలీల్ వేసిన మూడో ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. రెండు సిక్స్‌లు కొట్టడంతో ఆ ఓవర్లో మొత్తం 15 పరుగులు వచ్చాయి. అయితే ఐదో ఓవర్ తొలిబంతికి అన్షుల్ బౌలింగ్‌లో డికాక్ బౌల్డ్ అయ్యాడు. దీంతో అజింక్యా రహానె (20*: 17 బంతుల్లో 1 ఫోర్, ఒక సిక్స్)తో జట్టు కట్టిన నరైన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఖలీల్ వేసిన ఆరో ఓవర్లో రహానె ఒక సిక్స్ బాదగా, నరైన్ ఒక సిక్స్, ఫోర్ బాదడంతో మొత్తం ఈ ఓవర్లో 18 పరుగులు వచ్చాయి. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి కోల్‌కతా 71/1 తో నిలిచింది. అశ్విన్ వేసిన ఆ తర్వాతి ఓవర్లో నరైన్ వరుసగా రెండు సిక్స్‌లు బాదాడు. 8వ ఓవర్ తొలి బంతికి నూర్ అహ్మద్ బౌలింగ్‌లో సునీల్ ఔటైనప్పటికీ అప్పటికే కేకేఆర్ విజయం ఖాయమైంది. ఆ తర్వాత వచ్చిన రింకు సింగ్ (15*: 12 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్స్) 11వ ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టడంతో కోల్‌కతా విజయ తీరాలకు చేరింది.

టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ చేసింది. సీఎస్కే బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులు మాత్రమే చేశారు. ఈ సీజన్‌లో చెన్నై జట్టుకు తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించిన ధోనీ(1) నిరాశపర్చాడు. శివమ్(31), విజయ్ శంకర్(26) జట్టును ఆదుకున్నారు. మిగతా బ్యాటర్లలో రచిన్ 4, కాన్వే 12, రాహుల్ త్రిపాఠి 16, అశ్విన్ 1, జడేజా 0, దీపక్ హుడా 0, నూర్ అహ్మద్ 1, అన్షుల్ 3 పరుగులు చేశారు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ 2, హర్షిత్ రాణా 2, అలీ 1, వైభవ్ 1 చొప్పున వికెట్లు పడగొట్టారు.

**చెత్త రికార్డులు మూటగట్టుకున్న సీఎస్కే..**

చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఇది వరుసగా ఐదో ఓటమి. ఈ సీజన్‌లో సొంత మైదానంలో ఆ జట్టు వరుసగా మూడుసార్లు ఓటమిపాలైంది. ఇక ఐపీఎల్ చరిత్రలో చెన్నై వరుసగా ఐదు ఓటములు చవిచూడడం ఇదే తొలిసారి. సీఎస్కే జట్టుకు ఇదే అత్యంత ఘోర ఓటమి. ఎక్కువ బంతులు మిగిలి ఉండగానే ప్రత్యర్థి చేతిలో పరాజయం పాలైంది. కోల్‌కతా జట్టు ఇంకా 59 బంతులు మిగిలిఉండగానే విజయం సాధించింది.

# సెంచరీ కొట్టినా..
## ధోనీతో మాట్లాడలేకపోయా: ప్రియాంశ్ ఆర్య

**సెంచరీ సాధించినా.. ధోనీతో మాట్లాడే అవకాశం రాకపోవడమే తనను బాధించిందని యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య అన్నాడు.**

ఐపీఎల్ లో ఆడిన నాలుగో మ్యాచ్‌లోనే సెంచరీ బాదేసీ అందరి దృష్టిని ఆకర్షించాడు యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య . ఇటీవల చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ ఆటగాడు శతకంతో పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ మ్యాచ్ తర్వాత ధోనీ తో మాట్లాడాలని అనుకున్నప్పటికీ.. తనకు ఆ అవకాశం దొరకలేదని చెప్పాడు. అదొక్కటే తనను బాధిస్తోందని అన్నాడు.

“ధోనీ లాంటి గొప్ప ఆటగాళ్లపై ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి అవకాశం చాలా కొద్ది మందికి మాత్రమే వస్తుంది. వికెట్ల వెనుక ధోనీ సర్ ఉన్నప్పుడు ఒత్తిడి సహజమే. ఇక, అశ్విన్ లాంటి లెజండరీ బౌలర్లను ఎదుర్కొన్నప్పుడు టెన్షన్ ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సెంచరీ సాధించడం చాలా ఆనందంగా ఉంది. మ్యాచ్ తర్వాత ధోనీ సర్‌ని కలిసి మాట్లాడాలనుకున్నా. కానీ, నేను ఇంటర్వ్యూ ముగించుకునేసరికి ఆయన వెళ్లిపోయారు. ఆయనతో మాట్లాడలేకపోయా” అని ప్రియాంశ్ ఆర్య చెప్పాడు.

ఈ సందర్భంగా పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గురించి మాట్లాడుతూ.. “చెన్నైతో మ్యాచ్ కంటే ముందు రాజస్థాన్‌తో ఆడుతున్నప్పుడు తొలి బంతికే ఔట్ అయ్యా. దానికి చాలా బాధపడ్డా. కానీ పాంటింగ్ సర్, అయ్యర్ దాని గురించి ఒక్కసారి కూడా విమర్శించలేదు. బ్యాటింగ్ ఎలా మెరుగుపర్చుకోవాలో చెప్పి నాలో స్ఫూర్తి నింపారు” అని తెలిపాడు.

ఏప్రిల్ 8న జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ యువ ఓపెనర్.. చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఎనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లు పడిపోయినా.. ఏ మాత్రం భయపడకుండా క్రీజులో పాతుకుపోయాడు. కేవలం 39 బంతుల్లోనే శతకం సాధించి.. జట్టుకు అనూహ్య విజయాన్ని అందించాడు. దీంతో అతడి పేరు నెట్టింట మార్మోగింది.



# పాకిస్తాన్ జోరు.. వరుసగా రెండో విజయం

**ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్-2025లో పాకిస్తాన్ వరుసగా రెండో విజయం సాధించింది. లాహోర్ వేదికగా స్కాట్లాండ్ మహిళలతో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో పాక్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌ను వర్షం కారణంగా 32 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది.**

స్కాటిష్ బ్యాటర్లలో కెప్టెన్ కాథరిన్ బ్రైస్(91) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అలీసా లిస్టర్(31), సారా బ్రైస్(21) పర్వాలేదన్పించారు. పాక్ బౌలర్లలో కెప్టెన్ ఫాతిమా సానా నాలుగు వికెట్లతో చెలరేగింది. సానా 5 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 4 వికెట్లను తమ ఖాతాలో వేసుకుంది. ఆమెతో పాటు సాదియా ఇక్బాల్ రెండు, డయానా బేగ్ ఓ వికెట్ సాధించింది.



అనంతరం 187 పరుగుల లక్ష్యాన్ని పాక్ 30.4 ఓవర్లలో ఛేధించింది. పాక్ బ్యాటర్లలో ఓపెనర్ మునీబా అలీ(71), అలియా రియాజ్(68 నాటౌట్) హాఫ్ సెంచరీలతో మెరిశారు. స్కాట్లాండ్ బౌలర్లలో చోలీ అబెల్ రెండు వికెట్లు పడగొట్టగా.. రిచెల్ స్లాటెర్, కాథరిన్ ఫ్రేజర్ తలా వికెట్ సాధించారు. పాకిస్తాన్ తమ తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 14న వెస్టిండీస్‌తో తలపడనుంది. పాకిస్తాన్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 4 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.